క్లుప్తంగా

క్రికెట్ టోర్నమెంట్ విజేత రాణారాయల్



ఫిరంగిపురం: మండలంలోని బేతపూడి గ్రామంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న బేతపూడి ప్రీమియర్ లీగ్ సీజన్-4 క్రికెట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో 8 టీంలు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో యాంగ్రీ టైగర్స్ టీం పది ఓవర్లలో 63 పరుగులకు ఆల్ అవుట్ అయ్యింది. రాణా రాయల్ ఫైటర్స్ టీం ఏడు ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేధించింది. బెస్ట్ బ్యాట్‌మెన్‌గా ఖాజబంద, బెస్ట్ బౌలర్‌గా మదార్ వలి నిలిచారు. విజేతకు రూ.10 వేల నగదు, షీల్డ్‌ను లైఫ్‌కేర్ డయాగ్నస్టిక్ అధినేత షేక్ వలీ, ఖాజా మొహిద్దీన్ అందజేశారు.

బాలుడిపై పెంపుడు కుక్కల దాడి



దుగ్గిరాల: నాలుగు సంవత్సరాల బాలుడిపై పెంపుడు కుక్కల దాడి చేసిన ఘటన పేరుకలపూడి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సీ కాలనీకి చెందిన అట్లూరి కల్యాణ్‌కుమార్ కొడుకు సర్దార్ ఆరు బయట ఆడుకుంటూ ఉండగా కుక్కలు ఒక్కసారి దాడి చేశాయి. బాలుడి కాలు, వీపుపై గాట్లు పడ్డాయి. బాలుడిని స్థానిక ఈమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స అందించారు. ఓకే ఇంటిలో సుమారు ఎనిమిది కుక్కలు ఉన్నాయని, గతంలో కూడా చాలా మందిని గాయపరచాయని బాలుడి తల్లి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. ఈ ఘటనపై పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.

శివాలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా కోటేశ్వరరావు



మంగళగిరి టౌన్ : మంగళగిరిలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా బోగి కోటేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌తో పాటు ఎనిమిది మందిని ట్రస్ట్ బోర్డు డైరెక్టర్లుగా నియమించింది. తమకు అవకాశం కల్పించిన స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్‌కు, సహకరించిన నాయకులకు బోగి కోటేశ్వరరావు, డైరెక్టర్లు కృతజ్ఞతలు తెలిపారు.

ఉగాది క్రీడా పురస్కారాలు



మంగళగిరి టౌన్ : గుంటూరుకు చెందిన గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్, గ్లోబల్ మంత్లీ మ్యాగజైన్ ఉగాదిని పురస్కరించుకుని జిల్లాకు చెందిన శిక్షకులు, సీనియర్ క్రీడాకారులు, క్రీడా ప్రోత్సాహకులకు ఉగాది క్రీడా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా మంగళగిరికి చెందిన విజేత స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, కోచ్ పీవీఎస్డీ సత్యనారాయణ, సభ్యులు శంకర్‌రెడ్డి, రమేష్‌కు ఉగాది క్రీడా పురస్కారాలు దక్కాయి. క్రీడాపురస్కారాలు దక్కడంతో మంగళగిరికి చెందిన పలువురు సోమవారం వారికి అభినందనలు తెలిపారు.

స్వామివారి కల్యాణ మహోత్సవానికి తరలిరండి



మంగళగిరి టౌన్ : ఒంటిమిట్ట కోదండరామాలయంలో సీతారాముల వారి కల్యాణ మహోత్సవానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పద్మశాలీయులు తరలి రావాలని గుంటూరు జిల్లా స్వర్ణకార సంఘం, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ పిలుపునిచ్చారు. మంగళగిరి నగర పరిధిలోని స్వర్ణకార సంఘ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మహేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ సేవా సమితి ఆధ్వర్యంలో ఏప్రిల్ 10న గరుడ సేవలో భాగంగా శ్రీ సీతారాముల వారికి పట్టువస్త్రాలు సమర్పించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పద్మశాలీయులు తరలివచ్చి స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘ నాయకులు జానకి రామయ్య, ఉడతా శ్రీనివాసరావు, తిరువీధుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కొండపై మంటలు



మంగళగిరి: నగరంలోని గండాలయ స్వామి కొండపై కొందరు ఆకతాయిలు సోమవారం మధ్యాహ్నం నిప్పు పెట్టారు. దీంతో కొండకు మంటలు పాకాయి. నగరంలో మరింత వేడి పెరిగే అవకాశముందని ప్రజలు భయపడుతున్నారు.

రేషన్ బియ్యం సరఫరాలో గోల్‌మాల్

- తాడికొండ, తుళ్లూరు మండలాల్లో రేషన్ డీలర్లకే టోకరా
- సివిల్ సప్లయిస్ గోదాంలో ఇష్టారాజ్యంగా సరుకుల సరఫరా
- తూకం వేయకుండా బియ్యం పంపిణీ
- ప్రశ్నించిన రేషన్ డీలర్లపై కక్ష సాధింపులు
- రంధ్రం వేసి బస్తాకు 2 కేజీల బియ్యం లూటీ
- యథేచ్ఛగా నల్లబజారుకు పేదల బియ్యం



నేరుగా సరుకును లోడు చేస్తున్న కూలీలు

తాడికొండ: తాడికొండ, తుళ్లూరు మండలాల్లో రేషన్ బియ్యం సరఫరాలో యథేచ్ఛగా గోల్‌మాల్ జరుగుతోంది. పౌర సరఫరాల గోదాం నుంచి సరుకు సరఫరా చేసే సమయంలో అధికారులు, హమాలీల కుమ్మక్కుతో క్వింటాళ్ల కొద్దీ సరుకు పక్కదారి పడుతోంది. బియ్యం నల్లబజారుకు తరలుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. తాడికొండ పౌర సరఫరాల గోదాం నుంచి ప్రతి నెలా 81 మంది డీలర్లకు సుమారు 550 టన్నుల బియ్యం, 20 టన్నుల పంచదార, కందిపప్పు సరఫరా జరుగుతుంది. గోదాం నిర్వహణ అధికారులు, హమాలీల మధ్య సయోధ్యతో బియ్యం ఒక్కో గోతాముకు 2 కిలోల వరకు రంధ్రాల ద్వారా తీసేస్తున్నారు. ఇదే తరహాలో పంచదార, కందిపప్పు గోతాలకు రంధ్రాలు వేసి మాయం చేయడం పరిపాటిగా మారింది.

రేషన్ డీలర్లకు బెదిరింపులు..

డీలర్లకు సరుకును సరఫరా చేసే సమయంలో గోతాలను కాటా వేసి, అప్పగించాల్సి ఉన్నా.. అధికారులు నేరుగా లోడింగ్ చేసి గోతాలను కాటా లేకుండానే అంటగడుతుండటం పరిపాటిగా మారింది. దీనిపై రేషన్ డీలర్లు ప్రశ్నిస్తే వారిపై బెదిరింపులకు దిగడం వారిని ఇబ్బందులకు గురిచేస్తుండటంతో ఏ ఒక్కరూ కిక్కురుమనకుండా సరుకును



తూకం వేయకుండా డీలర్‌ను నిలబెట్టి బియ్యం పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎస్ గోదాం నిర్వాహకులు

తీసుకెళ్లి సామాన్యుడిపై ఆ భారాన్ని మోపి చేతులు దులుపుకుంటున్నారు. అడ్డదారిలో దోచుకున్న బియ్యాన్ని రేషన్ మాఫియాతో సంబంధాలు పెట్టుకొని, టన్నుల కొద్దీ సరుకును అధిక ధరలకు అమ్ముకొని పంచుకుంటున్నారు. ఈ వ్యవహారంలో అధికార పార్టీకి చెందిన రేషన్ డీలర్ల చేతివాటం జోరుగా నడుస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు.

అంతా ఆ డీలర్ చేతిలోనే..

ఓ రేషన్ డీలర్ చేతిలో రేషన్ బియ్యం మాఫియా నడుస్తోంది. రాత్రికి రాత్రే అతని కను సన్నల్లో బియ్యం నల్లబజారుకు తరలించి జేబులు నింపుకుంటున్నారనేది జగమెరిగిన సత్యం. ఇంత తంతు జరుగుతున్నా అక్రమాలను అరికట్టాల్సిన సివిల్ సప్లయిస్ అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన పాపన పోలేదు. దీంతో వారు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. సోమవారం సరుకుల తరలింపులో భాగంగా పౌర సరఫరాల గోదాంలో అధికారుల సమక్షంలో బియ్యం తూకం వేయకుండా డీలర్లనే నిలబెట్టి బరువు చూస్తున్నారు. దీనిపై గోదాం ఇన్‌చార్జి నరసింహమూర్తిని వివరణ కోరగా తూకం వేయనప్పటికీ సరుకు వ్యత్యాసం ఉండదని, అనుమానం ఉంటే ఎవరైనా అడిగితే వే బ్రిడ్జి కాటా వేస్తామని తెలిపారు. సంబంధిత అధికారులు ఇకనైనా స్పందించి, పేదల కడుపు నింపేందుకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం, సరుకులు పక్కదారి పట్టి అక్రమార్కుల జేబులు నింపకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అందరికీ సక్రమంగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎక్కడ?

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



నూతక్కిలో మాట్లాడుతున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి: రాష్ట్రంలోని మహిళలంతా ఉగాది రోజున ఉచిత బస్సు ప్రయాణం కోసం ఎదురు చూశారని వైఎస్సార్‌సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పేర్కొన్నారు. సోమవారం నూతక్కి, నవులూరులో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వేమారెడ్డి మాట్లాడుతూ మహిళలు తమకు ఉచిత బస్సు ప్రయాణం ఎక్కడని సీఎం చంద్రబాబు ప్రశ్నిస్తున్నారన్నారు. ప్రజలను అబద్ధపు హామీలతో మోసం చేయడమే చంద్రబాబు నైజం అని మండిపడ్డారు. వలంటీర్లకు రూ.10 వేలు జీతమిస్తామని చెప్పి, ఎన్నికలలో వారిని వాడుకుని అనంతరం ఆ వ్యవస్థే లేదన్న ఘనుడు చంద్రబాబు నాయుడని దుయ్యబట్టారు. అబద్ధపు హామీలతో మోసపోయిన ప్రజలు ఎప్పుడు ఎన్నికలు వచ్చినా చంద్రబాబును ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. దాడులు, తప్పుడు కేసులతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భయపడి పోతారనుకోవడం కూటమి ప్రభుత్వం భ్రమ అన్నారు. మాజీ ఎంపీపీ పచ్చల రత్నకుమారి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దొడ్డక శివపార్వతి, మండల అధ్యక్షుడు నాలి వెంకటకృష్ణ, బీసీ, ఎస్సీ సెల్ కన్వీనర్లు పల్లపు సుబ్బారావు, కట్టెపోగు భూషణం, జిల్లా కార్యదర్శి ఈపూరి ఆదామ్, పచ్చల శ్యాం బాబు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

మంగళగిరి టౌన్ : కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాశం రామారావు డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని పార్టీ కార్యాలయంలో సోమవారం పార్టీ పట్టణ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాల్లో ప్రతి మహిళకు నెలకు రూ.1500లు, నిరుద్యోగ భృతి, మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, తల్లికి వందనం వంటి హామీలకు ఇప్పటి వరకు అమలు చేయలేదని విమర్శించారు. నియోజకవర్గంలో మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకుని నివాసాలు ఉంటున్న 20 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తానని హామీ ఇచ్చి పాదయాత్ర సందర్భంగా శిలా ఫలకాన్ని కూడా వేయడం జరిగిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి 10నెలలు అవుతున్నా ఇప్పటివరకు ఇళ్లపట్టాలు ఇవ్వలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, పట్టణ కార్యదర్శి వివి జవహర్‌లాల్, సీనియర్ నాయకులు జెవి రాఘవులు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించాలి



మురుగు నిల్వ ప్రాంతాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లి రూరల్ : తాడేపల్లిలో మురుగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి రూరల్‌పరిధిలోని గుండిమెడ ప్రాంతంలో పార్టీ తాడేపల్లి మండల కార్యదర్శి పల్లెకృష్ణ, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, గ్రామ కార్యదర్శి నాగపోగు విజయరాజుతో కలసి దళితవాడలోని మురుగును పరిశీలించారు. ఈ సందర్భంగా పల్లెకృష్ణ మాట్లాడుతూ గుండిమెడ గ్రామంలో డ్రైయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఎక్కడి మురుగునీరు అక్కడే నిలిచిపోతోందని, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరుస్తామని అధికారులు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. గ్రామంలో, పరిసరాలలో వాడిన వ్యర్థపు మురుగునీరు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోందన్నారు. దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ మురుగునీరు భూగర్భ జలాలలో ఇంకిపోవడం వలన తాగునీరు కూడా కలుషితమవుతుందని చెప్పారు. ప్రజలు జబ్బుల బారిన పడక ముందే విలీన గ్రామమైన గుండిమెడలో మురుగు సమస్యను నివారించేందుకు డ్రైనేజీలను నిర్మించి, మురుగునీరు పారుదలయ్యే విధంగా ఎంటీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా మాలకొండారెడ్డి వర్ధంతి



మాలకొండారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

తాడేపల్లి రూరల్ : కామ్రేడ్ మాలకొండారెడ్డి వర్ధంతిని ఎంటీఎంసీ పరిధిలోని సుందరయ్యనగర్‌లో మాలకొండారెడ్డి స్థూపం వద్ద సోమవారం సీపీఎం నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా మాలకొండారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ సుందరయ్యనగర్ ప్రాంతంలో పేదల ఇళ్ల నివాసం ఏర్పాటులో కీలక భూమిక పోషించిన ధన్యజీవి మాలకొండారెడ్డి అని అన్నారు. సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా ముందు నిలబడిన పనిచేసిన వ్యక్తి మాలకొండారెడ్డి అని అన్నారు. నాయకులు ఎ. జగన్, ఎస్. వెంకటరావు, బూరుగ వెంకటేశ్వర్లు, దొంతిరెడ్డి శ్రీనివాస్ కుమారి, కొట్టే కరుణాకర్‌రావు, గాదె సుబ్బారెడ్డి, వేముల దుర్గారావు, నాగేశ్వరరావు, కె. మేరి, గిరిజ, దర్శనపు విజయ్‌బాబు, వెంకన్న, సామేలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈద్



ప్రార్థన చేస్తున్న ముస్లింలు



దుగ్గిరాల ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలు



మేడికొండూరు: మంగళగిరిపాడు ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు



బేతపూడిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



సరుకులు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకుడు గంగాధర్



మసీద్‌లో సందేశం ఇస్తున్న ఇమామ్



పోలకంపాడులోని మసీదులో చిన్నారుల ఆలింగనం

మంగళగిరి: ముస్లింలు పవిత్ర రంజాన్ పండుగను ఎంతో ఆనందంగా జరుపుకున్నారు. సోమవారం ఉదయం నుంచే సామూహిక ప్రార్థనలలో పాల్గొన్నారు. ఈద్గాలు, మసీదులకు చేరుకుని ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. ఇమామ్‌లు పవిత్ర రంజాన్ సందేశాన్ని అందజేశారు. ప్రేమ, సోదరభావం, శాంతికి చిహ్నమే రంజాన్ అని తెలిపారు. అల్లా దీవెనలతో చక్కగా వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండి ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. నగరంలోని ఈద్గా, మసీదుల వద్ద ఎలాంటి ఇబ్బంది లేకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

దుగ్గిరాల: రంజాన్ పర్వదినాన్ని దుగ్గిరాల మండలంలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ముస్లింలు సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. దుగ్గిరాలలోని ముర్తుజానగర్‌లో వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని పాల్గొన్నారు. రంజాన్ విశిష్టతను వివరించి, మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఫిరంగిపురం: మండలంలో భక్తిశ్రద్ధలతో రంజాన్ పండుగను నిర్వహించారు. బేతపూడి ఈద్గా వద్ద నిర్వహించిన ప్రార్థనల్లో ఇమామ్ షేక్.మస్తాన్‌వలి మాట్లాడుతూ ప్రతి ఒక్క ముస్లిం ప్రతిరోజు ఐదు పూటలా నమాజు చేయాలని చెప్పారు. ఇస్లాం అంటే శాంతి అని మహ్మద్ ప్రవక్త బోధించాడన్నారు. ప్రవక్త నడిచిన మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో రంజాన్ పండుగ పవిత్ర దినాన్ని పురస్కరించుకుని ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రంజాన్ వేడుకలు

తాడికొండ: పవిత్ర రంజాన్ పండుగను తాడికొండ, తుళ్లూరు మండలాల్లో ముస్లిం సోదరులు వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం అన్ని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. తాడికొండలో నిర్వహించిన రంజాన్ ప్రార్థనల్లో కేంద్రం అమల్లోకి తెచ్చిన వక్ఫ్ సవరణ చట్టానికి నిరసనగా ముస్లిం సోదరులు నల్ల రిబ్బన్లతో ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు.

ముస్లింలకు నిత్యావసరాల పంపిణీ

తాడికొండ: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని తాడికొండ మండలం మోతడక గ్రామానికి చెందిన బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు మంచికలపూడి గంగాధర్ నిత్యావసరాలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన 64 మంది ముస్లిం కుటుంబాలకు బెల్లం, కందిపప్పు, సేమియా, నూనె, ఖర్జూర, పసుపు, గోధుమ పిండి పలు సరుకులు పంపిణీ చేశారు.



లాం గ్రామం ఈద్గాలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు



గౌతమ బుద్ధ రోడ్డులోని మసీదులో ప్రత్యేక ప్రార్థనలు

ప్రభుత్వం కార్మికుల సమస్యను పరిష్కరించాలి



దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న వేముల దుర్గారావు

తాడేపల్లి రూరల్ : కూటమి ప్రభుత్వం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని యూనియన్ నాయకులు కె.ఆదినారాయణ, కూరపాటి స్టీవెన్‌లతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ సుమారు 30 సంవత్సరాల క్రితం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీని అక్రమ లాకౌట్ చేసి కార్మికులను నడివీధిలో నిలబెట్టారని విమర్శించారు. ప్రభుత్వాలు మారుతున్న కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కారం కాకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం. గురవయ్య, వై. రమాదేవి, టి. దుర్గాభవాని, ఇమాంబి, సారమ్మ, సుబ్బారావు, హగ్గయ్య, బి. నవనీతం పాల్గొన్నారు.

దావా సమను

మహారాజశ్రీ సత్తెనపల్లి సివిల్ జడ్జి వారి (సీనియర్ డివిజన్) కోర్టులో
ఐ.ఏ. నెం. 548/2024
ఓ.యస్. నెం. 239/2016

పిటీషన్
వక్కా @ మన్నవ దీప్తి ... వాది
మరియు
1. వక్కా పరమేశ్వరరావు (మరణం)
2. వక్కా హరి బాబు
3. కోట సుబ్బాయమ్మ
4. కొత్తూరి పూర్ణ చంద్రరావు
5. ఇనగంటి లక్ష్మి ... ప్రతివాదులు
కు
5వ ప్రతివాది:
ఇనగంటి లక్ష్మి, W/o. గంగాధర్, హిందూ, వయస్సు 53 సంవత్సరాలు. R/o. మందపాడు గ్రామం, మేడికొండూరు మండలం, గుంటూరు జిల్లా.
పై 5వ వారికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, వాద విక్రయ దస్తావేజు.నెం. 3693/1947, తేదీ 19-08-1947 మరియు బహుమతి దస్తావేజు 3420/2016, తేదీ 04-05-2016 డాక్యుమెంట్లో ఉన్నా ఆస్తికి డిక్లరేషన్ కోసం మరియు ప్రతివాదులపై 1 నుండి 4 వరకు శాశ్వతమైన ఉత్తర్వుల కోసం పై కోర్టులో దావా చేయగా, దావా జరుగుచున్న సమయంలో 1వ ప్రతివాది మరణించటం జరిగింది. కావున 1వ ప్రతివాది వారసత్వం రీత్యా మిమ్మల్ని దావా నందు చేర్చటం జరుగుతుంది. దావా లో మీ నోటీసు నిమిత్తం. ది. 08-04-2025 వ తేదీకి వాయిదా అయిఉన్నది. ఆ రోజున ఉదయం సమయం 10.30 నిమిషాలు మీరు స్వయంగా గాని, లేక ప్లీడర్ గారి ద్వారా గాని పై కోర్టు వారి యెదుట హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేని యెడల మీ పరోక్షమందు దావా తీర్మానము జరుగునని తెలుసుకోగలరు.
వాయిదా తేదీ: 08-04-2025 కోర్టు వారి అనుమతితో.
ప్రకటన దాఖలుచేయు నిమిత్తం ది. 08-04-2025 వాయిదా అయి ఉన్నది.
సత్తెనపల్లి, తేదీ.24-03-2025 — డి.బాపయ్య చౌదరి, వాది తరఫున న్యాయవాది.

వక్ఫ్ బోర్డు సవరణ చట్టం బిల్లుపై ముస్లింల నిరసన



నిరసన తెలుపుతున్న ముస్లిం మహిళలు



మసీదుల వద్ద నల్ల బ్యాడ్జీలు కడుతున్న ముస్లింలు

మంగళగిరి: వక్ఫ్ చట్టం సవరణ బిల్లుతో ముస్లింల హక్కులు, ప్రార్థనాలయాలకు, వక్ఫ్ ఆస్తుల భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదముందని ముస్లిం మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని నిడమర్రు రోడ్డులో ఉన్న అరవింద మోడల్ స్కూలులో అన్సారీ ఇస్లామిక్ సెంటర్ ఆధ్వర్యంలో ఈద్ నమాజ్ నిర్వహించారు. వక్ఫ్ బిల్లును నిరసిస్తూ పెద్ద ఎత్తున ప్లకార్డులు ప్రదర్శించి, నిరసన వ్యక్తం చేశారు. వక్ఫ్ సవరణ బిల్లుతో తాము అభద్రతా భావానికి లోనై, రంజాన్ పండగ కూడా సంతృప్తిగా జరుపుకోలేకపోతున్నామని వాపోయారు. ముస్లింల మనోభావాలను గౌరవించి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌లు బిల్లుకు మద్దతు ఇవ్వకుండా తీర్మానం చేయాలని కోరారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి

మంగళగిరి టౌన్ : వక్ఫ్ సవరణ చట్టం 2024ను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దుచేయాలని మంగళగిరి పట్టణానికి చెందిన పలువురు ముస్లిం మత పెద్దలు, ముస్లిం సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు వక్ఫ్ సవరణ చట్టం రద్దు కోరుతూ సోమవారం పలు మసీదుల వద్ద నల్లబ్యాడ్జీలను ధరించి ప్లకార్డులతో నిరసన తెలిపారు. పార్లమెంట్‌లో బిల్లును ప్రతిపాదన చేస్తోందన్నారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.